క్లుప్తంగా

బుద్ధుడు చూపిన బాటలో నడవాలి

ఇంద్రవెల్లి: ప్రపంచానికి శాంతిమార్గాన్ని చూపిన గౌతమ బుద్ధుడి బాటలో నడవాలని భారతీయ బౌద్ధ మహాసభ భైంసా పట్టణ అధ్యక్షుడు హేమ్లే ప్రసంజీత్ అన్నారు. ఆదివారం భారతీయ బౌద్ధ మహాసభ భైంసా పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని బుద్ధనగర్‌లో గల పంచశీల బుద్ధవిహార్‌లో నూతనంగా ఎన్నికైన అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్, భారతీయ బౌద్ధ మహాసభ మండల కమిటీ సభ్యులను సన్మానించారు. ముందుగా గౌతమ బుద్ధుడు, అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల గౌరవ అధ్యక్షుడు మారుతి, అధ్యక్షుడు మనోహర్, ప్రధాన కార్యదర్శి కాంరాజ్, కోశాధికారి సునీల్, సంతోశ్, సత్యానంద్, దీలిప్ మోరే, రాజవర్దన్, బాబారావ్, శివాజీ పాల్గొన్నారు.

శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి



సర్టిఫికెట్లు అందజేస్తున్న రవికిరణ్

ఎదులాపురం: సాయి వైకుంఠ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచితంగా అందించే మగ్గం, ఎంబ్రాయిడరీ, టెయిలరింగ్ శిక్షణను మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ట్రస్ట్ చైర్మన్ రవి కిరణ్ యాదవ్ అన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, యువతులకు ఆదివారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ట్రస్ట్ బాధ్యులు రఘువీర్ యాదవ్, రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్ గట్టయ్య, ట్రస్ట్ మేనేజర్ సల్ల విజయ్‌బాబు, రవి, శ్రీనివాస్, రామన్న, వేణు, రవికాంత్, శిక్షకులు పెందూర్ లక్ష్మీ, రాథోడ్ పూజ, అందుగుల శ్రావణి, ఓరగంటి వీణ పాల్గొన్నారు.

వైద్య శిబిరానికి స్పందన

బేల: మండల కేంద్రంలోని తెలుగు మీడియం మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ప్రాంగణంలో ఆదివారం కార్మికశాఖ, సీఎస్‌సీ హెల్త్ కేర్ ఆధ్వర్యంలో లేబర్‌కార్డు ఉన్న కార్మికులకు ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. 74మందికి 50 రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు సీఎస్‌సీ జిల్లా కోఆర్డినేటర్ సయ్యద్ పర్వేజ్ తెలిపారు. లేబర్‌కార్డు ఉన్న వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెల్త్‌కేర్ క్యాంప్ కోఆర్డినేటర్ అబ్దుల్ ఖదర్ సుఫీ, సామాజిక కార్యకర్తలు వెంకన్న, హరీష్, రితేశ్ పాల్గొన్నారు.

ఏకధాటిగా వర్షం

తాంసి: తాంసి, భీంపూర్ మండలాల్లోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. మండలంలోని తాంసి, హస్నాపూర్, వడ్డాడి, పొన్నారి, కప్పర్ల, జామిడి, అంబుగాంతో పాటు భీంపూర్ మండలంలోని నిపాని, వడూర్, కరంజి, అర్లి, ధనోరా, అంతర్గాం గ్రామాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. దీంతో పంట చేలలో వర్షం నీరు నిలిచింది. సాగు చేసిన పంటలకు అనుగుణంగా వర్షాలు కురవడంతో అన్నదాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

బోథ్: సమస్యల పరిష్కారం కోసం పంచాయతీ కార్మికులు చేస్తున్న సమ్మె ఆదివారం 11వ రోజుకు చేరుకుంది. డిమాండ్లను సాధించే వరకు దీక్షలు కొనసాగిస్తామన్నారు. వీరికి సీపీఐ నాయకులు, పద్మశాలి సంఘం సభులు మద్దతు తెలిపారు. మెరుగు భోజన్న, సురేందర్, కార్తీక్, సత్తయ్య, గోవర్ధన్, దాస్, షాకీర్, సుమేర్ పాషాలు పాల్గొన్నారు.

మండలం సాధించే వరకు పోరాడుతాం



మాట్లాడుతున్న మాజీ జెడ్పీటీసీ బాబన్న

తలమడుగు: ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు ఐక్యతగా ఉండి బరంపూర్ మండలం సాధించే వరకు పోరాడుతామని మాజీ జెడ్పీటీసీ బాబన్న అన్నారు. ఆదివారం మండలంలోని బరంపూర్ రైతువేదికలో ప్రజలతో సమావేశం నిర్వహించారు. బరంపూర్ మండల కేంద్రం ఏర్పాటు కోసం గ్రామస్తులు ప్రజాప్రతినిధులు ఐక్యంగా ఉండాలన్నారు. మండల ఏర్పాటుకు బరంపూర్ అనుకూలమైందని, వసతులు, వనరులు ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు రమేశ్‌రెడ్డి, లింగారెడ్డి, సాగర్, విఠల్, తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలం.. జరభద్రం

- కోతకు గురైన రోడ్లు
- పొంచి ఉన్న ప్రమాదం
- ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోని వైనం



గేర్జం వద్ద కోతకు గురైన రోడ్డు



దుబార్‌పేట్ వద్ద ప్రమాదకరంగా రోడ్డు

ఇచ్చోడ: గ్రామీణ ప్రాంతాలకు వెళ్లే రోడ్లు ప్రమాదకరంగా మారాయి. కోతకు గురైన ప్రదేశాల్లో తరుచుగా ప్రమాదాలు జరుగుతున్నా.. ఏళ్లుగా మరమ్మతులకు నోచుకోవడం లేదు. కొన్నిచోట్ల రోడ్ల అంచుల వెంట మట్టి కొట్టుకుపోయి గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి. ఆయా మార్గాల్లో కొత్తగా ప్రయాణించే వారు ఎక్కడ ఏ గుంత ఉంటుందో తెలియక ప్రమాదాల బారిన పడుతున్నారు.

ప్రమాదకరంగా రోడ్లు..

- మండలంలోని గేర్జం చించోలి గ్రామాల మధ్య గత రెండేళ్ల కిందట గేర్జం చెరువు పొంగి పొర్లడంతో రోడ్డు కొట్టుకుపోయింది. రోడ్డుకు ఒకవైపు పెద్ద గుంత ఏర్పాడి ప్రమాదకరంగా మారింది. వర్షకాలంలో ఈ ప్రాంతాల్లో ప్రమాదాలు జరుగుతున్నాయి.
- మండలంలోని మాదపూర్ పట్వారి గూడల మధ్య సిరికొండ వెళ్లే దారిలో గత నాలుగేళ్ల కిందట వంతెన నిర్మించారు. వంతెనకు రెండు వైపుల రక్షణ గోడ నిర్మించ లేదు. వర్షకాలంలో వంతెన వద్ద ప్రమాదం పొంచి ఉంది.
- మండల కేంద్రం నుంచి సోనాల వెళ్లే దారిలో అడేగామ(కె) వాగుపై భారీ వంతెన నిర్మించారు. వంతెనను ఆనుకొని అప్రోచ్ రోడ్డు వేయకపోవడంతో వాహనాలు అదుపు తప్పుతున్నాయి.
- మండల కేంద్రం నుంచి జాతర్ల వెళ్లే దారిలో ఇచ్చోడ తండా మూలమలుపు వద్ద బీటీ రోడ్డుపై పెద్దగుంత ఏర్పడింది.
- ఇచ్చోడ మండల కేంద్రం నుంచి సిరికొండ వెళ్లే దారిలో దుబార్‌పేట్ ఫ్లైఓవర్ కింద గతేడాది కురిసిన వర్షాలకు రోడ్డుకు ఇరువైపులా కోతకు గురైంది. దీంతో రాత్రి ప్రమాదాలు జరుతున్నాయి.
- మండల కేంద్రం నుంచి సిరిచెల్మ వెళ్లే దారిలో మేడిగూడ సమీపంలో వంతెన నిర్మాణం పనులు అసంపూర్తిగా వదిలేయడంతో వాహనాదారులు ప్రమాదానికి గురవుతున్నాయి. వర్షకాలంలో మరిన్ని ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది.

మరమ్మతులు చేపట్టాలి



సిరిచెల్మ వెళ్లే దారిలో గేర్జం వద్ద రోడ్డు కోతకు గురైంది. రెండేళ్లవుతున్నా.. మరమ్మతులు చేపట్టడం లేదు. తరుచు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టాలి.

– శ్రీధర్, సిరిచేల్మ

కోతకు గురైన రోడ్డు



గత రెండెళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు దుబార్‌పేట్ పై ఓవర్ వంతెన కింద రోడ్డు రెండువైపులా కోతకు గురైంది. ఈరోడ్డు గుండా ప్రయాణించే వారు తరచు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.

– నాగరాజు, దుబార్‌పేట్

నిరంతర విద్యుత్ సరఫరాకు కృషి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న

బేల: నిరంతర విద్యుత్ సరఫరాకు ప్రభుత్వం కృషి చేస్తోందని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. ఆదివారం మండలంలోని సిర్సన్న రెవెన్యూ గ్రామ శివారులో ప్రత్యేక అభివృద్ధి నిధులు రూ.1 కోటి వ్యయంతో సబ్‌స్టేషన్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజా సమస్యలను గుర్తించి, దశలవారీగా పరిష్కరిస్తామన్నారు. వ్యవసాయ రంగానికి, సంస్థలకు నిరంతర విద్యుత్ అందించడంతో రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెరిగాయన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మూడు గంటల విద్యుత్ సరిపోతుందనడం సరికాదన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రావుత్ మనోహర్, జిల్లా డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, విద్యుత్ శాఖ జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్, డీఈ హరికృష్ణ, ఠాక్రే గంభీర్, జక్కుల మధుకర్, సతీష్ పవార్, దీపక్‌గౌడ్, భూమన్న పాల్గొన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ నేతల మాటలు నమ్మొద్దు

ఆదిలాబాద్‌రూరల్: ఎన్నికల సమయంలో వచ్చే కాంగ్రెస్, బీజేపీ నాయకులను నమ్మవద్దని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తుందన్నారు. ఆదివారం మండలంలోని చాందా (టి) గ్రామంలో పలువురు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రూ. 15 లక్షల వ్యయంతో నిర్మించనున్న సవారీబంగ్లా షెడ్ నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఇటీవల మృతిచెందిన బీఆర్ఎస్ కార్యకర్త జలారపు శ్రీనివాస్ రూ. లక్ష ఆర్థిక సాయం అందజేశారు. రేవంత్‌రెడ్డి రైతులకు మూడు గంటల విద్యుత్ సరిపోతుందని వ్యాఖ్యలు చేయడం ఆపార్టీ విధానాలకు అద్దం పడుతుందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, గ్రంథాలయ చైర్మన్ రౌత్ మనోహర్, ఎంపీపీ గంద్రత్ రమేశ్, రొకండ్ల రమేశ్, కిరణ్, మహేందర్, భాస్కర్, ప్రహ్లాద్ పాల్గొన్నారు.



భూమిపూజ చేస్తున్న ఎమ్మెల్యే జోగు రామన్న

రాప్ సాంగ్ రూపొందించడం అభినందనీయం

ఆదిలాబాద్: జిల్లా విశిష్టతను తెలియజేసేలా రాప్ సాంగ్ రూపొందించడం అభినందనీయమని ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. జిల్లా కేంద్రంలోని డీసీసీబీ అతిథి గృహంలో జిల్లాకు చెందిన పలువురు యువకులు రూపొందించిన ఆర్ఎస్ 38 ర్యాపర్ గీతాన్ని ఆదివారం విడుదల చేశారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, కౌన్సిలర్ బండారి సతీశ్, సాంగ్ కంపోజర్ నితిన్ పవార్, డైరెక్టర్ రాహుల్ తాడే, ఎడిటర్ రాహుల్ పటాడే పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ను తెలంగాణ నుంచి తరిమేయాలి

- బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

ఆదిలాబాద్‌టౌన్: తెలంగాణ రాష్ట్రం నుంచి కాంగ్రెస్‌ను తరిమివేయాలని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌పై టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలపై సోమవారం నుంచి బోథ్ నియోజకవర్గంలోని రైతువేదికల్లో 'మూడు గంటల కరెంటు కావాలా.. మూడు పంటలు కావాలా' అనే అంశంపై రైతులతో చర్చించడం జరుగుతుందన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని టైలర్స్ కాలనీలో గల ఫంక్షన్‌హాల్‌లో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. సమావేశంలో బీఆర్ఎస్ బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్టె కిరణ్ కుమార్, నాయకులు వెంకటేశ్, అరుణ్, బ్రహ్మనంద్, శివారెడ్డి, రుక్మణ్‌సింగ్, రాజారాం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు

రైతు సంక్షేమమే ధ్యేయం

తలమడుగు: రైతు సంక్షేమమే ధ్యేయంగా సీఎం కేసీఆర్ ముందుకు వెళ్తున్నాడని బోథ్ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు అన్నారు. ఆదివారం మండలంలోని పునగుడలో సవారీబంగ్లాను ప్రారంభించారు. అలాగే ఝరిలో షెడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో కరెంట్ కోతలతో ఇబ్బంది పెట్టిన కాంగ్రెస్‌ను ప్రజలు నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో నాయకులు మొట్టే కిరణ్‌కుమార్, తోట వెంకటేశ్, కాటిపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, వెల్మా శ్రీనివాస్‌రెడ్డి, జీవన్‌రెడ్డి, మగ్గిడి ప్రకాశ్, సర్పంచ్ రఘునాథ్, రాంబాయి, మహేశ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

నేరడిగొండ: మండల కేంద్రంలోని భీమన్న కాలనీలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని కాలనీవాసులు భయాందోళన చెందుతున్నారు. ప్రమాదకర స్థితిలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను సరిచేయాలని స్థానికులు కోరుతున్నారు.



వైద్య శిబిరం

ఆదిలాబాద్‌టౌన్: ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని కన్యక పరమేశ్వరీ ఆలయంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అంతకుముందు వాసవిమాతా చిత్రపటానికి పూజలు చేశారు. వైద్యులు విజయలక్ష్మీ పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు పంపిణీ చేశారు. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఇంటిపరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం పట్టణ అధ్యక్షుడు రాజేశ్వర్, సంఘ బాధ్యులు సంజయ్, జయ, సునైన, సరిత, కీర్తి, స్వరూప, సంతోషిని పాల్గొన్నారు.

'ఇంటింటికీ టీడీపీ'

ఆదిలాబాద్‌టౌన్: వచ్చే ఎన్నికల్లో టీడీపీని గెలిపించాలని తెలుగు యువత అధ్యక్షుడు గాలిపెల్లి నాగన్న అన్నారు. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కాసాని జ్ఞానేశ్వర్ ఆదేశాల మేరకు ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమం చేపట్టారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని దస్నాపూర్, పిట్టలవాడ కాలనీల్లో కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు పోచన్న, అంకుష్, రాజేశ్వర్, ప్రేమ్‌కుమార్, సందీప్, సాయి, శ్రీనివాస్, గణేశ్, పొచ్చక్క, సంగీత, సువర్ణ పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బోథ్: నాటిన మొక్కలను సంరక్షించాలని హిందూ ధర్మ జాగరణ మండలి సభ్యులు అన్నారు. ఆదివారం మండలంలోని సొనాల రామాలయం ఆవరణలో మొక్కలు నాటారు. మొక్కలతోనే మానవ మనుగడ సాధ్యమన్నారు. కార్యక్రమంలో హిందూ ధర్మ జాగరణ సభ్యులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు ఆత్మగౌరవ సభ

ఆదిలాబాద్‌రూరల్: బహుజన్ సమాజ్ పార్టీ ఆత్మ గౌరవ సభను సోమవారం ఇచ్చోడ మండల కేంద్రంలోని షార్ప్ గార్డెన్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు లక్ష్మీకాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 1.30 గంటలకు నిర్వహించే సమావేశానికి బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్ కుమా ర్ హాజరు కానున్నట్లు పేర్కొన్నారు.

రేపు అన్నాభావుసాఠే వర్ధంతి

ఆదిలాబాద్‌రూరల్: ఆదిలాబాద్ పట్టణంలోని అన్నాభావుసాఠే చౌక్‌లో మంగళవారం అన్నాభావు సాఠే వర్ధంతనిని నిర్వహించనున్నట్లు అన్నాభావు సాఠే అసోసియేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు సూర్యకాంత్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. వర్ధంతి వేడుకలకు పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ సభ్యులు సూర్యవంశీ, రామారావు, రాజ్‌కుమార్, విష్ణు, శంకర్, నాందేవ్, సూర్యకాంత్, తదితరులు పాల్గొన్నారు.

19న నాసిక్‌లో మాలీల జాతీయస్థాయి సమ్మేళనం

ఆదిలాబాద్‌రూరల్: అఖిల భారతీయ మాలీ మహాసంఘం స్థాపన దినోత్సవాన్ని పురస్కరించుకొని మహారాష్ట్రలోని నాసిక్‌లో ఈనెల 19న మాలీల జాతీయస్థాయి సమ్మేళనం నిర్వహించనున్నట్లు అఖిల భారతీయ మాలీ మహాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు సుకుమార్ పేట్కులే తెలిపారు. జిల్లా కేంద్రంలోని పూలే గెస్ట్‌హౌస్‌లో ఆదివారం ఆయన మాట్లాడారు. 18న మధ్యాహ్నం ఒంటిగంటకు నందిగ్రామ్ ఎక్స్‌ప్రెస్ ద్వారా నాసిక్‌లో జరిగే జాతీయ సమ్మేళనానికి వెళ్లడం జరుగుతుందన్నారు.

స్వచ్ఛతపై అవగాహన కల్పించాలి



అధికారులతో సమావేశమైన డీఆర్‌డీవో

ఇంద్రవెల్లి: మండలంలోని ముత్నూర్ గ్రామంలో ఇంటింటిని సందర్శించి స్వచ్ఛతపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీవో కిషన్ అన్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2023 అవార్డు ఎంపికలో భాగంగా ఆదివారం మండలంలోని ముత్నూర్ గ్రామానికి సందర్శించి అభివృద్ధి పనులను పరిశీలించారు. పనులను గడువులోగా పూర్తి చేయాలన్నారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో ఐకేపీ అధికారులతో సమావేశమయ్యారు. అభివృద్ధి పనుల్లో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. డీఎల్పీవో భిక్షపతి గౌడ్, ఎంపీడీవో పుష్పలత, ఏపీఎం రామారావ్, సర్పంచ్ తుంరం బాగుబాయి, సిబ్బంది పాల్గొన్నారు.



బోనం ఎత్తుకున్న మున్సిపల్ చైర్మన్



బోథ్: బోనాలతో వస్తున్న మహిళలు

ఘనంగా బోనాల పండుగ

ఆదిలాబాద్: మున్సిపాలిటీ పరిధిలోని తిరుమల నగర్ కాలనీలో ఆదివారం బోనాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అమ్మవారికి బోనం సమర్పించి, పూజలు నిర్వహించారు. బోనాలు సమర్పించడానికి వచ్చే భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ లక్ష్మణ్, కొప్పుల దేవిదాస్, ప్రేమ్ సింగ్, గణేశ్, కృష్ణ రమేశ్ పాల్గొన్నారు.

బోథ్: మండల వ్యాప్తంగా బోనాలు పండుగను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. బోథ్, సొనాలతో పాటు ఆయా గ్రామాల్లో గ్రామ దేవతలకు బోనాలను సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా కురవాలని, పంటలు బాగా పండాలని మొక్కుకున్నారు. డప్పు వాయిద్యాలతో శోభాయాత్ర నిర్వహించారు.

ఘనంగా మహా శివ మహిమ మహోత్సవం

ఆదిలాబాద్‌టౌన్/ఆదిలాబాద్: శ్రీసంకట మోచన్ హనుమాన్ దేవాలయం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన మహా శివ మహిమ మహోత్సవ కార్యక్రమం ఉత్సాహంగా సాగింది. ఆదిలాబాద్ పట్టణంలోని పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొని పరమ పూజ శ్రీకపరాంజీ మహరాజ్ ఆశీర్వాదం తీసుకున్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో పరమ పూజ్య శ్రీకృపరాంజీ మహరాజ్ భక్తులకు ఆధ్యాత్మిక ప్రవచనాలు బోధించారు.



ఊరేగింపులో పాల్గొన్న పాయల్ శంకర్, భక్తులు

బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్



కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్‌టౌన్: బీజేపీ ఆధ్వర్యంలో టిఫిన్ బైఠక్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని రాధేరాధే గోషాలలో జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేశారు. టిఫిన్ బైఠక్ ప్రధాని నరేంద్ర మోదీ ఎంతో ఇష్టమైందన్నారు. నా యకులు, కార్యకర్తలు తమ ఇంటి నుంచి తీసుకొచ్చిన టిఫిన్‌ను ప్రచారం అనంతరం తినడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకురాలు సుహాసిని రెడ్డి, లాలామున్న, మయూర్ చంద్ర, విజయ్, నగేశ్, వేణుగోపాల్, లోక ప్రవీణ్ రెడ్డి, జ్యోతిరెడ్డి, జోగు రవి, సోమ రవి, ఆకుల ప్రవీణ్, రఘుపతి, గంగారెడ్డి, దత్త పాల్గొన్నారు.

'మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదు'

బేల: మండల కేంద్రంలోని ఎస్సీ బాలుర వసతి గృహంలో మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్‌రెడ్డి ఆరోపించారు. ఆదివారం మధ్యాహ్నం వసతి గృహాన్ని ఏబీవీపీ బృందం సందర్శించింది. విద్యార్థులతో మాట్లాడి, సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్నం 12 మంది విద్యార్థులకు కేవలం 250 గ్రాములు చికెన్ తీసుకువచ్చి వండగా.. ఒక్కొ విద్యార్థికి ఒక ముక్క కూడా రాలేదన్నారు. ఇన్‌చార్జి వార్డెన్ సైతం అందుబాటులో ఉండడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకుడు అంకుష్, ఏబీవీపీ సభ్యులు మనోజ్‌రెడ్డి, అజయ్, కృష్ణ, మహేశ్, తరుణ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మాడవార్ హరీష్‌రెడ్డి

దుర్భర జీవితంలో కుటుంబం

- కిడ్నీ వ్యాధితో మంచాన పడిన నానుబాయి
- మతిస్థిమితం లేని కూతురు విజయ
- పింఛన్ డబ్బులన్నీ మందులకే
- ఆదుకోవాలని వేడుకోలు

బోథ్: ఆ కుటుంబాన్ని విధి పగబట్టింది. అప్పటికే బీద పరిస్థితుల్లో ఉన్న కుటుంబంలో ఒకరు కిడ్నీ వ్యాధితో బాధపడుతుండగా.. కూతురు మానసిక పరిస్థితి బాగోలేదు. వచ్చిన పింఛన్ డబ్బులు మందులకే సరిపోతున్నాయి. దీంతో వారి జీవనం దుర్భరంగా మారింది. బోథ్ మండల కేంద్రంలోని కొత్త కాలనీకి చెందిన నానుబాయి, ఆమె కూతురు విజయ కడుపేదరికంలో బతుకుతున్నారు. నానుబాయి కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. సపర్యలు చేయాల్సిన కూతురు విజయకు మానసిక స్థితి బాగోలేదు. డయాలసిస్ చేయించుకోవడానికి చేతిలో చిల్లిగవ్వ లేకపోవడంతో ఏం చేయాలో తెలియక ఇంట్లోనే ఉంటుంది. మందుల కోసం ప్రతీ 15 రోజులకు ఒకసారి రూ. 2000 ఖర్చు అవుతోంది. నానుబాయికి నెలకు రూ. 2016, కూతరు విజయకు రూ. 2016 పింఛన్ రావడంతో వాటిని మందులకే ఖర్చు చేస్తున్నారు. స్థానికులు కొంత మేర ఆర్థిక సాయం చేస్తున్నారు. మిగిలిన దాంట్లోనే తమ జీవనాన్ని కొనసాగిస్తున్నారు. పింఛన్ ఆలస్యమైతే మందులకు కష్టతరంగా మారుతోంది. కనీసం ఇంట్లో కూడా ఎటువంటి సౌకర్యాలు లేవు.



నానుబాయితో కూతురు విజయ

దయాలసిస్ కోసం డబ్బుల్లేని పరిస్థితి..

నానుబాయి ఆరోగ్యం రోజురోజుకూ క్షీణిస్తోంది. కిడ్నీ సంబంధిత వ్యాధి కోసం డయాలసిస్ చేయించుకోవడానికి డబ్బులేని పరిస్థితి. మందులు వేసుకుంటూ తన జీవనాన్ని కొనసాగిస్తోంది. డయాలసిస్ చేస్తే తాను బతికే అవకాశం ఉందని తెలిసినా.. తనకు సాయం చేసేవారు లేకపోవడంలో తనలో తాను క్షోభపడుతోంది. సాయం అందిస్తే డయాలసిస్ చేయించుకుంటానని, తమను ఆదుకోవాలని వేడుకోంటుంది.

సాయం చేయాల్సిన వారు..

అకౌంట్ నంబరు: 62309879535
పేరు: సోలంకి విజయ
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా
బ్రాంచ్, బోథ్
ఐఎఫ్ఎస్‌సీ కోడ్: ఎస్బీఐఎన్ 0020127